క్లుప్తంగా

చెంచులకు వ్యవసాయ పరికరాలు పంపిణీ



అమ్రాబాద్: పదర మండలంలోని మద్దిమడుగు, పెట్రాల్‌చేన్ పెంటలతో పాటు అమ్రాబాద్ మండలంలోని జంగంరెడ్డిపల్లిలో సోమవారం కోనేరు సంస్థ ఆధ్వర్యంలో చెంచు కుటుంబాలకు వ్యవసాయ పరికరాలు పంపిణీ చేశారు. టార్పాలిన్లతో పాటు పార, గడ్డపార, గంపలు అందించారు. చెంచుల జీవనోపాధులను మెరుగు పరిచేందుకు కృషి చేస్తున్నామని, అందులో భాగంగానే చెంచులకు వ్యవసాయ పరికరాలు పంపిణీ చేసినట్లు కో ఆర్డినేటర్ ఇస్మాయెల్ తెలిపారు.

కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ

కొల్లాపూర్: మండలం కుడికిళ్ల గ్రామానికి చెందిన పలువురు లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులను సోమవారం పంపిణీ చేశారు. తహసీల్దార్ విష్ణువర్ధన్‌రావు చెక్కులు అందజేశారు. కార్యక్రమంలో మాజీ సింగిల్‌విండో అధ్యక్షులు రఘుపతిరావు, కుడికిళ్ల మాజీ సర్పంచ్ జ్యోతి రాము, మాజీ ఎంపీటీసీ శంకర్‌నాయుడు తదితరులున్నారు.

హైదరాబాద్‌కు తరలిన నాయకులు

కొల్లాపూర్: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌ను నిరసిస్తూ ప్రజాసంఘాల ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో చేపట్టిన ధర్నాకు సోమవారం కొల్లాపూర్ నుంచి వామపక్ష, కార్మిక సంఘాల నాయకులు తరలివెళ్లారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి శివవర్మ, నాయకులు సలీం, బాలపీరు, మల్లేష్, తదితరులున్నారు.

రంగనాయక స్వామి దేవాలయానికి విరాళం

వెల్దండ: మండల కేంద్రంలోని శివుడి గుట్టపై ఉన్న రంగనాయక స్వామి దేవాలయ నిర్మాణానికి దాతలు విరాళాలు అందజేశారు. సోమవారం వెల్దండకు చెందిన ధనుంజయ్య దేవాలయ ముఖద్వారానికి రూ.35వేలు, కానుగుల ప్రసాద్ రూ.23వేలు, వెంకటయ్య రూ.5వేలు, శివకుమార్ రూ.10వేల చొప్పున విరాళాలను అందజేశారు. కార్యక్రమంలో వెంకటేష్, సంతోష్, భక్త బృందం సభ్యులు ఉన్నారు.

త్రుటిలో తప్పిన ప్రమాదం

ఉప్పునుంతల: మండలంలోని శ్రీశైలం–హైదరాబాద్ ప్రధాన రహదారిలోని లత్తీపూర్ స్టేజీ సమీపంలో సోమవారం సాయంత్రం కారును వెనక నుంచి టిప్పర్ వేగంగా ఢీకొట్టడంతో త్రుటిలో ప్రమాదం తప్పిన సంఘటన సోమవా రం చోటుచేసుకుంది. బాధితుల వివరాల ప్ర కారం.. అచ్చంపేటకు చెందిన చోలేటి రాఘవేందర్ తన కారులో హైదరాబాద్ నుంచి అచ్చంపేటకు వస్తున్నాడు. లత్తీపూర్ స్టేజీ సమీపంలో వెనకవైపు నుంచి అతివేగంగా వచ్చిన టిప్పర్ కారును ఢీకొట్టడంతో కారు వెనకభాగం దెబ్బతిన్నది. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ బ్రహ్మయ్య తెలిపారు.

మూత్రశాలల నిర్మాణానికి భూమి పూజ

తాడూరు: మండల కేంద్రంలోని ప్రభుత్వ కార్యాలయాల ఆవరణలో మూత్రశాలల నిర్మాణానికి ఎంపీడీఓ ఆంజనేయులు భూమిపూజ చేశారు. కార్యక్రమంలో ఏపీఓ చంద్ర సిద్ధార్థ పాల్గొన్నారు.

త్రైత సిద్ధాంత గ్రంథాలపై ప్రచారం

తెలకపల్లి: మండలంలోని గడ్డంపల్లి గ్రామంలో త్రైత సిద్ధాంత భగవద్గీత గ్రంథాలపై కమిటీ సభ్యులు సోమవారం ప్రచారం నిర్వహించారు. ఆచార్య ప్రబోధనందయోగీశ్వరులు రచించిన ఈ గ్రంథాలను ఇంటింటికి వెళ్లి ప్రచారం చేస్తూ పంపిణీ చేశారు. కార్యక్రమంలో సేవ సమితి ఇందు జ్ఞాన వేదిక అచ్చంపేట, నాగర్‌కర్నూల్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

కేజీబీవీ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలి



పెద్దకొత్తపల్లి: కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని త హసీల్దార్ జేకే మోహన్ అన్నారు. సోమవారం కేజీబీవీ పాఠశాలను ఆయన తనిఖీ చేశారు. పాఠశాలలోని రికార్డులను వంటగది, బియ్యం, కూరగాయలను, పరిసరాలను పరిశీలించారు. మరుగుదొడ్లు, మూత్రశాలను ప్రతిరోజు పరిశుభ్రంగా ఉంచాలని ఎస్ఓ లతకు సూచించారు.

జాతీయ స్థాయిలో రాణించాలి

- కలెక్టర్ బదావత్ సంతోష్
- సివిల్ సర్వీసెస్ క్రీడలకు ఎంపికైన ఉద్యోగులకు సన్మానం



జాతీయ స్థాయి సివిల్ సర్వీసెస్ క్రీడలకు ఎంపికైన వారిని సన్మానిస్తున్న కలెక్టర్ బదావత్ సంతోష్

నాగర్ కర్నూల్: జిల్లా తరపున రాష్ట్ర స్థాయి క్రీడా పోటీల్లో పాల్గొని ప్రథమ, ద్వితీయ స్థానాల్లో విజేతలుగా నిలిచి, జాతీయస్థాయి సివిల్ సర్వీస్ క్రీడలకు ఎంపికైన 10 మంది వివిధ శాఖల ఉద్యోగ క్రీడాకారులను కలెక్టర్ బదావత్ సంతోష్ శాలువాతో సత్కరించి అభినందించారు. సోమవారం జిల్లా కలెక్టర్ ఛాంబర్‌లో అదనపు కలెక్టర్ పి అమరేందర్, జిల్లా యువజన క్రీడల శాఖ అధికారి వి.సీతారాంలతో కలిసి జాతీయ స్థాయి సివిల్ సర్వీస్ ఉద్యోగుల క్రీడాకారులను సన్మానించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నాగర్ కర్నూల్ జిల్లాకు చెందిన 10 మంది ఉద్యోగులు ఎంపికకావడం సంతోషదాయకమన్నారు. ఆల్ ఇండియా సివిల్ సర్వీసెస్ టోర్నమెంట్ రాష్ట్ర స్థాయి పోటీలలో గతనెల జనవరి 23వ తేదీ నుంచి జనవరి 24వ తేదీల్లో హైదరాబాద్‌లో నిర్వహించిన వివిధ రకాల క్రీడల్లో నాగర్‌కర్నూల్ జిల్లా నుంచి పాల్గొని ప్రథమ, ద్వితీయ స్థానంలో గెలిచి జాతీయ స్థాయి ఆల్ ఇండియా సివిల్ సర్వీసెస్ టోర్నమెంట్‌కు 10 మంది జిల్లా క్రీడాకారులు ఎంపికైనట్లు తెలిపారు. డీ. ఆంజనేయులు(అథ్లెటిక్స్), కె. మహే ష్(అథ్లెటిక్స్), ఎన్. గోపాల్(అథ్లెటిక్స్), వి. లక్ష్మన్(అథ్లెటిక్స్), ఎం.చంద్రకళ(అథ్లెటిక్స్),జె.లక్ష్మి(ఖోఖో) బి. సతీష్ కుమార్(వాలీబాల్),యం.జ్యోతి (వాలీబాల్), పి.జ్యోతి (వాలీబాల్), ఎస్.జాను (వెయిట్ లిఫ్టింగ్)కు ఎంపికైనట్లు తెలిపారు.

సంక్షేమానికి ప్రజా ప్రభుత్వం పెద్దపీట

– అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ



మొల్గరలో గ్రామ నూతన పంచాయతీ భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ

ఉప్పునుంతల: సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం అభివృద్ధి, ప్రజల సంక్షేమానికి అధిక ప్రాధాన్యత ఇస్తుందని అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ అన్నారు. మండలంలో పలు అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన, ప్రారంభోత్సవాలు చేశారు. మామిళ్లపల్లిలో ఎన్ఆర్ఈజీఎస్ నిధులు రూ.20 లక్షలతో నిర్మించనున్న గ్రామ పంచాయతీ భవన నిర్మాణ పనులకు భూమి పూజ చేశారు. ఎస్సీ సబ్‌ప్లాన్ నిధులు రూ.10 లక్షలతో రెండు సీసీ రోడ్ల నిర్మాణ పనులకు ఎమ్మెల్యే భూమి పూజ నిర్వహించారు. మండలంలోని మొల్గరలో ఎన్ఆర్ఈజీఎస్ నిధులు రూ.20 లక్షలతో గ్రామ పంచాయతీ భవనాన్ని ప్రారంభించారు. మండల కేంద్రంలో మగ్గం వర్క్స్ నేర్చుకున్న మహిళలకు ఎమ్మెల్యే సర్టిఫికెట్లు అందజేశారు.

గ్రామాల అభివృద్ధే లక్ష్యంగా పని చేస్తున్నాం

బల్మూర్: గ్రామాల అభివృద్ధే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తుంటే ప్రతిపక్షాలు తమ ఉనికి చాటు కోవడం కోసం తప్పుడు ప్రచారాలతో పబ్బం గడుతున్నారని ఎమ్మెల్యే డా. చిక్కుడు వంశీకృష్ణ అన్నారు. మండలంలోని పోలిశెట్టిపల్లిలో రూ.25 లక్షలతో చేపట్టనున్న సీసీ రోడ్డు పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు.

సైన్స్‌పై అభిరుచి పెంచుకోవాలి



మాట్లాడుతున్న ఉపాధ్యాయులు

కందనూలు: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సోమవారం ఫోరం ఫర్ ఫిజికల్ సైన్స్ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి భౌతిక రసాయన శాస్త్ర టాలెంట్ టెస్ట్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆకాడమిక్ మానిటరింగ్ అధికారి షర్ఫుద్దీన్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మారుతున్న సమాజానికి అనుగుణంగా విద్యార్థులు పాఠశాల స్థాయి నుంచే సైన్స్ పై అభిరుచి పెంచుకోవాలని, శాస్త్రవేత్తల జీవిత చరిత్రలను ఆదర్శంగా తీసుకోవాలన్నారు. ఫిజికల్ సైన్స్ ఫోరం జిల్లా అధ్యక్షుడు నాగరాజు మాట్లాడారు. జిల్లాలోని ప్రతి మండలం నుండి 66మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఇందులో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానంలో ఎంపికైన విద్యార్థులు 12వ తేదీన రాష్ట్ర స్థాయిలో నిర్వహించే టాలెంట్ టెస్టులో పాల్గొనడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు గోపాల్‌రెడ్డి, సుదర్శన్ పాల్గొన్నారు.

బాలికలకు హెచ్‌బీ పరీక్షలు



విద్యార్థులకు పరీక్షలు చేస్తున్న ఆర్‌బీఎస్‌కే ఫార్మసిస్టు రాజు

మన్ననూర్: కేంద్ర ప్రభుత్వ ఆధీనంలోని ఆర్‌బీఎస్‌కే ఆధ్వర్యంలో స్థానిక సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల/కళాశాల (బాలికలు) విద్యార్థినులకు సోమవారం హిమోగ్లోబిన్ పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాలలోని 120 మంది బాలికలకు పరీక్షలు నిర్వహించగా, వారిలో 8 మంది బాలికలు రక్త హీనతతో బాధపడుతున్నట్లు నిర్ధారించారు. వారిని సమీపంలోని ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లి వైద్యాధికారులు సుధాకర్, గౌతమ్, శ్రీవాణి, ఫార్మసిస్టు రాజులతో పరీక్షలు చేయించి మందులు అందజేశారు. ప్రభుత్వం వసతి గృహాల్లో పౌష్టికాహారం అందించాలని ఆదేశాలున్నా, నిబంధనలు, మెనూ పాటించడంలేదన్నారు. వసతి గృహాల్లో సరైన పౌష్టికాహారం ఇవ్వకపోవడంతోనే రక్త హీనత, ఇతర ఆరోగ్య సమస్యలు వస్తున్నాయని తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. ఆదివారం విద్యార్థులకు ఇచ్చిన మాంసాహారం కలుషితం కావడంతో విద్యార్థులకు విరేచనాలు అయినట్లు తెలిపారు. సంబంధిత అధికారులు ఆకస్మిక తనిఖీ నిర్వహించి మార్పులు తీసుకురావాలని విద్యార్థులు, తల్లిదండ్రులు కోరుతున్నారు.

ఇళ్లు నిర్మించి ఇవ్వాలని బాధితుల ధర్నా



కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న సీపీఎం నాయకులు, బాధితులు


నాగర్‌కర్నూల్‌రూరల్: స్థానిక కలెక్టరేట్ వద్ద సోమవారం చారగొండ గ్రామానికి చెందిన జాతీయ రహదారి 167కు అడ్డుగా ఉన్న ఇళ్లను అధికారులు తొలగించారు. ఈ సంఘటనలో ఇళ్లు కో ల్పోయిన బాధితులకు ప్రభుత్వం కొత్త ఇళ్లు నిర్మించి ఇవ్వాలని, ఒక్కో కుటుంబానికి రూ.50 లక్షలు నష్టపరిహారం ఇవ్వాలని డిమాండ్ చేస్తూ సీపీఎం ఆధ్వర్యంలో సోమవారం ధర్నా నిర్వహించారు. బైపాస్ బాధితులకు ఎలాంటి ప్రత్యామ్నాయం చూపకుండా ఇళ్లను నేలమట్టం చేయడం సరికాదని, గతంలో ఇచ్చిన నష్ట పరిహారం బాధితులకు సరిపోదని అన్నారు. ప్రభుత్వం ఇచ్చిన పరిహారం వల్ల 100 గజాల స్థలం కూడా రాని పరిస్థితి ఉందన్నారు. ఇంటి నిర్మాణంతో పాటు రూ.50 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు బాలస్వామి, అశోక్, కల్వకుర్తి కాశన్న, రాజు, అనిల్, అలివేల, శిరిష, గిరిజ పాల్గొన్నారు.

ఇంటి నిర్మాణాలకు ఇసుక అనుమతివ్వాలి



వెల్దండ: మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రజావాణిలో సోమవారం బీజేపీ నాయకులు తహసీల్దార్ కార్తీక్ కుమార్‌కు ఇసుక అనుమతి ఇవ్వాలని వినతి పత్రం అందజేశారు. గ్రామాల్లో ప్రజలు చేపడుతున్న ఇంటి నిర్మాణాలకు ఇబ్బందులు పడుతున్నట్లు పేర్కొన్నారు. రెవెన్యూ, పోలీస్ అధికారులు ఇసుకకు అనుమతి ఇవ్వక పోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షులు యాదగిరి, నాయకులు ఉన్నారు.

రైతులను ఆదుకోవాలని వినతి



నాగర్‌కర్నూల్‌రూరల్: పవర్‌గ్రిడ్ కార్పొరేషన్ అఫ్ ఇండియా నూతనంగా నిర్మిస్తున్న 765 కేవీ డీసీ లైన్ (కర్నూల్–రంగారెడ్డి)లో పంట భూములు కోల్పోతున్న రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని, ఏపీలో ఇస్తున్న పరిహారం ఇక్కడా ఇవ్వాలని డిమాండ్ చేశారు. సోమవారం తెలకపల్లి మండలంలోని రావిపాకులు, గౌతమ్‌పల్లి, కల్వకుర్తి, కొల్లాపూర్ నియోజకవర్గాల రైతులు జిల్లా అదనపు కలెక్టర్ అమరేందర్‌కు వినతిపత్రం అందజేశారు. ప్రస్తుత మార్కెట్ రేటును ఇవ్వాలని, జాతీయ రహదారుల పక్కన ఉన్న భూములకు 50 శాతం పెంచి ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో 50 మందికి పైగా రైతులు పాల్గొన్నారు.

మండలంలో మహిళా ఓటర్లదే పైచేయి

కల్వకుర్తి రూరల్: మండలంలో మహిళా ఓటర్లే అధికంగా ఉన్నారు. మండలంలోని 24 గ్రామ పంచాయతీల పరిధి తోపాటు 11 ఎంపీటీసీ స్థానాల ఓటర్ల సంఖ్యను సోమవారం ఎంపీడీఓ కార్యాలయంలో విడుదల చేశారు. మండలంలో 31,501 ఓటర్లు ఉన్నారు. వారిలో మహిళలు 15,794 ఓటర్లు ఉండగా, పురుషులు 15,707 మంది ఓటర్లు ఉన్నారు. దీంతో మహిళా ఓటర్ల సంఖ్య అధికంగా మారింది. మండలంలో మొత్తం 11 ఎంపీటీసీ స్థానాలు ఉన్నాయి. ప్రభుత్వం ఎన్నికలకు కసరత్తు చేస్తుండడంతో అధికారులు ఓటరు లిస్టును ప్రభుత్వ ఆదేశాల మేరకు విడుదల చేశారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ వెంకట్ రాములు మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటామని చెప్పారు.

డ్రాఫ్ట్ ఓటరు జాబితా విడుదల



చారకొండ: మండలంలోని 6 ఎంపీటీసీ, జెడ్పీటీసీ స్థానాలకు సంబంధించి డ్రాఫ్టు ఓటరు జాబితాను సోమవారం మండల కేంద్రంలో ఎంపీడీఓ ఇసాక్ హుస్సేన్ విడుదల చేశారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో భాగంగా డ్రాఫ్టు ఓటరు జాబితాను గ్రామ పంచాయతీలకు పంపినట్లు తెలిపారు. ఎలాంటి అభ్యంతరాలున్నా సరి చేసుకోవాలన్నారు. అభ్యంతరాల అనంతరం తుది జాబితాను ఈనెల 16న విడుదల చేయనున్నట్లు తెలిపారు. గ్రామ పంచాయతీ ఎన్నికలకు రిటర్నింగ్, అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులకు మంగళవారం కలెక్టర్ కార్యాలయంలో శిక్షణ ఉంటుందని, వారు తప్పకుండా హాజరు కావాలన్నారు. కార్యాక్రమంలో ఎంపీఓ వెంకటేష్, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

విద్యార్థిని కుటుంబాన్ని ఆదుకుంటాం: ఎమ్మెల్యే కసిరెడ్డి



వెల్దండ: మండలంలోని చొక్కన్నపల్లిలో విద్యార్థిని ఆరాధ్య బాలానగర్ గురుకుల పాఠశాలలో అనుమానాస్పదంగా మృతి చెందింది. సోమవారం బాధిత కుటుంబాన్ని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గురుకుల పాఠశాలల్లో విద్యార్థిని ఆత్మహత్యకు పాల్పడడం బాధాకరమన్నారు. ప్రభుత్వం పరంగా కుటుంబాన్ని అన్ని విధాలుగా ఆదుకుంటామన్నారు. విద్యార్థిని మృతి కారకులు ఎంతవారైనా శిక్షిస్తామన్నారు. అనంతరం బాధిత కుటుంబాన్నికి రూ.5వేల ఆర్థిక సాయం అందజేశారు. ఆయన వెంట తహసీల్దార్ కార్తీక్‌కుమార్, కాంగ్రెస్ నాయకులు బాలాజీసింగ్, భూపతిరెడ్డి, సంజీవ్‌కుమార్, మోతిలాల్‌నాయక్, మట్ట వెంకటయ్యగౌడు, పర్వత్‌రెడ్డి, జంగయ్యయాదవ్, పుల్లయ్య, రమేష్, ఎర్రశ్రీనుముదిరాజ్, రాజశేఖర్, తిరుపతిరెడ్డి, మట్ట భరత్‌గౌడు ఉన్నారు.

యువతకు ఉద్యోగ అవకాశాలు

కందనూలు: రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యశాఖ ఆధ్వర్యంలో రాష్ట్రంలోని యువతకు ఉపాధి అవకాశాలు పెంపొందించేందుకు డిజిటల్ ఎప్లాయిమెంట్ ఎక్చంజ్ ఆఫ్ తెలంగాణ ప్రారంభించినట్లు జిల్లా పరిశ్రమల శాఖ జనరల్ మెనేజర్ సచిన్ తెలిపారు. డీఈఈటీ ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకున్న ఉద్యోగార్థులకు నూతన సాంకేతిక విధానాన్ని నేర్పించి, ఉద్యోగాలు అవకాశాలు కల్పించబడు తుందని, దీనికి జిల్లాలోని పాలిటెక్నిక్, ఐటీఐ, డిగ్రీ చివరి సంవత్సరం చదువుతున్న వారు అప్లై చేసుకోవాలని తెలిపారు. సోమవారం కలెక్టరేట్‌లో కలెక్టర్, అదనపు కలెక్టర్ నిర్వహించిన కార్యక్రమంలో డీఆర్‌డీఓ ఓబులేషు, జిల్లాలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్స్, ఐటీఐ ప్రిన్సిపాల్స్, ఎంప్లాయిమెంట్ ఆఫీసర్లు, లైబ్రరీ ఆఫీసర్లు పాల్గొన్నారు.

వ్యక్తి అదృశ్యం

నాగర్‌కర్నూల్ క్రైం: వ్యక్తి అదృశ్యం కావడంతో కేసు నమోదైన సంఘటన సోమవారం మండలంలో చోటుచేసుకుంది. ఎస్ఐ గోవర్ధన్ వివరాల ప్రకారం .. జిల్లా కేంద్రానికి చెందిన ఆంజనేయులు ఈనెల 4న మహబూబ్‌నగర్‌లో ఓ వ్యక్తి వద్ద డబ్బులు తీసుకొస్తానని ఇంట్లో చెప్పి వెళ్లాడు. తిరిగి ఇంటికి రాకపోవడంతో కుటుంబసభ్యులు ఎంతవెతకినా ఆచూకీ లభించకపోవడంతో పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఆదివాసీల కోఆర్డినేటర్‌గా గోపినాయక్



పెంట్లవెల్లి: నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలో సోమవారం ఆదివాసి గిరిజన నాయకులు సమావేశం నిర్వహించారు. కొల్లాపూర్ నియోజకవర్గ ఆదివాసి గిరిజన సంఘం కోఆర్డినేటర్‌గా పెంట్లవెల్లి మండలం, ఎంగంపల్లి తండాకు చెందిన మాజీ సర్పంచ్ గోపినాయక్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆయనకు ఎస్సీసెల్ జిల్లా అధ్యక్షులు హనుమంతునాయక్ నియామక పత్రం అందజేశారు. అనంతరం గోపినాయక్ మాట్లాడారు.

శిక్షణ తరగతులు విజయవంతం చేయండి

కొల్లాపూర్ నియోజకవర్గం సోమశిల గ్రామంలో కృష్ణానది పరివాహక ప్రాంతాల ఆదివాసి, గిరిజన ప్రాంతాల ప్రజలకు రాజకీయ శిక్షణ తరగతులు ఈనెల 12, 13 తేదీల్లో నిర్వహిస్తున్నట్లుగా జిల్లా అధ్యక్షుడు హనుమంతు, కో ఆర్డినేటర్ గోపినాయక్‌లు తెలిపారు. ఈ అవకాశాన్ని ఆదివాసి గిరిజనులు, లంబాడీలు, చెంచులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

డ్రంకెన్‌డ్రైవ్‌లో వ్యక్తికి రిమాండ్

తాడూరు: డ్రంకెన్‌డ్రైవ్‌లో కేసులో పట్టుబడిన వ్యక్తిని రిమాండ్‌కు పంపినట్లు ఎస్ఐ గురుస్వామి సోమవారం తెలిపారు. నాగర్‌కర్నూల్ మండలం పులిజాల గ్రామానికి చెందిన భోగరాజు సురేష్ (30) మద్యం తాగి పోలీసుల తనిఖీలో పట్టుబడ్డాడు. కోర్టులో హాజరుపరచగా ప్రిన్సిపాల్ జ్యూడిసియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ పుట్ట మౌనిక రూ.2500 జరిమానాతో పాటు 5 రోజులు రిమాండ్ విధించనట్లు ఎస్ఐ తెలిపారు.

బీటీరోడ్డుకు ఎమ్మెల్యే శంకుస్థాపన



విగ్రహప్రతిష్ఠలో భక్తులతో ఎమ్మెల్యే రాజేష్‌రెడ్డి

నాగర్‌కర్నూల్‌రూరల్: మండలంలోని పెద్దాపూర్ నుంచి బొందలపల్లి వరకు గల బీటీ రోడ్డు పనులను ఎమ్మెల్యే కూచుకుళ్ల రాజేష్‌రెడ్డి సోమవారం ప్రారంభించారు. ఈ పనులకు రూ.2.90 కోట్లు మంజూరైనట్లు తెలిపారు. కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ చైర్మన్ రమణారావి, నాయకులు కోటయ్య, కొండనాగేష్, మాధవరెడ్డి, రమేష్, తదితరులు పాల్గొన్నారు.

విగ్రహ ప్రతిష్ఠలో ఎమ్మెల్యే

బిజినేపల్లి: మండలంలోని నందివడ్డెమాన్‌లో చెన్నకేశవస్వామి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమంలో ఎమ్మెల్యే కూచుకుళ్ల రాజేష్‌రెడ్డి పాల్గొని పూజలు నిర్వహించారు. చెన్నకేశవస్వామి విగ్రహాన్ని గర్భగుడిలో ప్రతిష్ఠించారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు నంద కిషోర్‌రెడ్డి ఎమ్మెల్యే రాజేష్‌రెడ్డికి పూర్ణకుంభంతో స్వాగతం పలికి, సన్మానించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

క్రీడలు మానసిక ఉల్లాసాన్నిస్తాయి

పెద్దకొత్తపల్లి: కీడాకారులకు క్రీడలు మానసిక ఉల్లాసాన్నిస్తాయని నాగర్‌కర్నూల్ ఎమ్మెల్యే కూచుకుళ్ల రాజేష్‌రెడ్డి అన్నారు. దేవల్‌తిర్మలాపూర్‌లో బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని మాజీ ఎంపీపీ సూర్యప్రతాప్‌గౌడ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జిల్లా స్థాయి పోటీలను ఎమ్మెల్యే ప్రారంభించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ సూర్యప్రతాప్ గౌడ్, మైసమ్మ ఆలయ చైర్మన్ శ్రీనివాసులు, వెంకటేశ్వర్‌రావు, సత్యం, దండు నరసింహ, చిన్నయ్య, రవికుమార్, ప్రతాపరెడ్డి పాల్గొన్నారు.

మాజీ ఎంపీపీ సూర్యప్రతాప్‌గౌడ్ పుట్టినరోజు వేడుకలు వేంకటేశ్వర స్వామి దేవాలయంలో కాంగ్రెస్ నాయకులు ఘనంగా నిర్వహించారు.

బాధిత కుటుంబాన్ని పరామర్శించిన ఎమ్మెల్యే

తెలకపల్లి: మండల కేంద్రంలో రెండు రోజుల క్రితం అనారోగ్యంతో మృతి చెందిన బొంతల చిన్నయ్య కుటుంబాన్ని ఎమ్మెల్యే కూచుకుళ్ళ రాజేష్‌రెడ్డి పరామర్శించారు. ఆయన వెంట సింగిల్‌విండో వైస్ చైర్మన్ మామిళ్ళ యాదయ్య, తదితరులు ఉన్నారు.

ఘనంగా ధ్వజ స్తంభ ప్రతిష్ఠ



పెంట్లవెల్లిలో గంగమ్మ ఆలయంలో ధ్వజస్తంభ ప్రతిష్ఠ చేస్తున్న కమిటీ సభ్యులు



కొల్లాపూర్‌లో పోచమ్మ గుడి వద్ద బోనాలతో భక్తులు

పెంట్లవెల్లి: మండల కేంద్రంలో మూడు రోజులుగా గంగమ్మ నూతన ఆలయ ప్రారంభోత్సవం, నవగ్రహాలు, ధ్వజస్తంభ ప్రతిష్ఠ కార్యక్రమాలు కొనసాగాయి. సోమవారం అమ్మవారికి ఉదయం ప్రత్యేక పూజలు నిర్వహించి గణపతి పూజ, నవగ్రహ పూజ, గంగమ్మ అభిషేకం, మంగళహారతి నిర్వహించారు. అమ్మవారిని పలు కాలనీల్లో ఊరేగించారు. అనంతరం 11:30 గంటలకు ధ్వజస్తంభ ప్రతిష్ఠను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి చుట్టుపక్కల గ్రామాల నుంచి ప్రజలు పెద్ద సంఖ్యలో తరలి వచ్చారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు, అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో పెంట్లవెల్లి గంగమ్మ దేవాలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో పోచమ్మ బోనాలు

కొల్లాపూర్: కొల్లాపూర్‌లో గ్రామ దేవతల ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. ఆదివారం రాత్రి కోటమైసమ్మకు లాంచనంగా పూజలు నిర్వహించారు. సోమవారం సాయంకాలం పోచమ్మ దేవతకు ఊర బోనాలు ఎత్తారు. పట్టణంలోని రాజీవ్. ది, ఆర్టీసీ డిపో, 16వ వార్డు, వరిదేల చెరువు కట్ట కింద, ఎస్సీ హాస్టల్ సమీపంలో పోచమ్మ దేవతలకు భక్తులు బోనాలతో నైవేద్యాలు సమర్పించారు. కోళ్లు, పొట్టేళ్లు బలిచ్చి తమ మొక్కులు తీర్చుకున్నారు. వరిదేల, కొల్లాపూర్ ప్రజలు వేర్వేరుగా ఊరేగింపుతో బోనాలతో గుడికి వెళ్లారు. స్థానిక నాయకులు ఊరేగింపులో పాల్గొన్నారు.

ముగిసిన విగ్రహ ప్రతిష్ఠ

కోడేరు: మండలంలోని రాజాపూర్‌లో మూడు రోజుల క్రితం ప్రారంభమైన విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాలు ముగిశాయి. ప్రాణప్రతిష్ఠాపన, విద్యాగణపతి, రామలింగేశ్వరస్వామి నాగదేవత విగ్రహాలను పునఃప్రతిష్ఠించినట్లు అర్చకులు శరత్‌చంద్ర, పవన్, శ్రావణ్, భాస్కర్‌శర్మ, సంతోష్ తెలిపారు.

ట్రస్మా ఆధ్వర్యంలో సైన్స్‌ఫెయిర్



కొల్లాపూర్: నియోజకవర్గంలోని అన్ని ప్రైవేట్ పాఠశాలలు (ట్రస్మా) ఆధ్వర్యంలో సైన్స్‌ఫెయిర్ నిర్వహించారు. కొల్లాపూర్ పట్టణంలోని ఎస్ఎం గార్డెన్‌లో ఏర్పాటు చేసిన సైన్స్‌ఫెయిర్‌లో 30 పాఠశాలలకు చెందిన విద్యార్థులు పాల్గొన్నారు. సైన్స్‌ఫెయిర్‌కు ట్రస్మా రాష్ట్ర అధ్యక్షులు సాదుల మధుసూదన్ ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. కార్యక్రమంలో ట్రస్మా నియోజకవర్గ అధ్యక్షులు రఘుపతి రెడ్డి, గౌరవ అధ్యక్షులు కారంచేడు రామానుజం, ప్రధాన కార్యదర్శి నయీాం, వెంకటేష్, శివకుమార్, భగవాన్‌గౌడ్, ప్రహ్లాద్, శ్రీధర్‌గౌడ్ ఉన్నారు.

డెయిరీ సైన్స్ విద్యార్థుల క్షేత్ర పర్యటన



కందనూలు: నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ సైన్స్ డిగ్రీ కళాశాల డెయిరీ సైన్స్ విద్యార్థులు అధ్యాపకుడు ఇంజమూరి దశరథం యాదవ్ ఆధ్వర్యంలో సోమవారం కల్వకుర్తి పట్టణంలోని పాలశీతల కేంద్రాన్ని సందర్శించారు. పాల ప్రాసెసింగ్ విధానంపై అవగాహన కల్పించారు. ఫ్యాట్, ఎస్ఎన్ఎఫ్ పరీక్ష, ఉష్ణోగ్రత నియంత్రణ, ఫిల్టరేషన్, సెంట్రిఫిగేషన్, చల్లబరిచే ప్రక్రి య, పాలసేకరణ విధానం వంటి అంశాలను వివరించారు. డెయిరీ మేనేజర్ యాకన్న, చిల్లింగ్ కంట్రోల్ అధికారి మమత, వెటర్నరీ డాక్టర్ భాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఉపాధి పనులపై గ్రామసభ



వెల్దండ: మండలంలోని అజిలాపూర్, సిలోనిబావి తండాలో సోమవారం సామాజిక తనిఖీ బృందం ఆధ్వర్యంలో ఉపాధి హామీ పనులపై గ్రామసభలు నిర్వహించారు. ఉపాధి హామీలో చేపట్టిన వివిధ పనులు, నిధుల ఖర్చులపై గ్రామసభలో ప్రజలకు వివరించారు. అజిలాపూర్‌లో రూ.31.78లక్షలు, సిలోనిబావితండాలో రూ.21.57లక్షలతో పనులు చేసినట్లు సామాజిక తనిఖీ బృందం సభ్యులు వివరించారు. ఉపాధి హామీ పనుల్లో అక్రమాలను పూర్తిస్థాయిలో ఈనెల 14వ తేదీన జరిగే మండలసభలో వివరిస్తామని తనిఖీ బృందం సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో ఏపీఓ ఈశ్వర్‌జీ, ఈసీ దేవేందర్‌గౌడు, టీఏలు శివలీల, సంతోష్ ఉన్నారు.

రైతులందరికీ రుణమాఫీ చేయాలి

కొల్లాపూర్: రైతులందరికీ రుణమాఫీ చేయాలని కోరుతూ సోమవారం కొల్లాపూర్ మండలంలోని రామాపురం గ్రామానికి చెందిన రైతులు కలెక్టరేట్‌లో జేసీ అమరేందర్‌కు వినతిపత్రం అందజేశారు. పెంట్లవెల్లి సింగిల్‌విండో సొసైటీలో 499 రైతులకు రుణమాఫీ కాలేదని, రామాపురం రైతులు పెద్దసంఖ్యలో పెంట్లవెల్లి సొసైటీలో పంట రుణాలు తీసుకున్నట్లు తెలిపారు. దీనిపై పలుమార్లు తహసీల్దార్‌కు, ఏఓలకు వినతిపత్రాలు అందించారు. అయినా ఫలితం లేకపోవడంతో కలెక్టరేట్‌లో అందజేశారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రుణమాఫీ చేయాలని కోరారు.